


సూర్యోదయమో, సూర్యాస్తమయమో, నిండు పున్నమో, చక్కటి దృశ్యమో, మధుర సంగీతమో, అరుదైన సన్నివేశమో, జన సమ్మర్దమో, మహోత్సవమో, నిరుపహతిస్థలమో—

బస్సులోనో, రైలులోనో, పోస్టాఫీసులోనో, క్యూలోనో,

కాలేజీ ఆవరణలోనో, కాఫీ హోటలు దగ్గరో, పార్కు మలుపులోనో, చిత్రకళా ప్రదర్శనంలోనో—

—ఎక్కడో, ఎలాగో అయినా 'ప్రేమ కథ'లు మొదలవ్వాలంటే...

రెండు మనసులు పెనవేసుకోవాలంటే....

ఆ హృదయాలు దగ్గరయే వాతావరణం....

ప్రత్యేకంగా, చిత్రంగా, ప్రశస్తంగా కూడా....

ఉండాలా?

* * *

గోపాలానికి జీవితం చెడ్డ ఇరుకుగానూ, అసమర్థవంతంగానూ, అప్పుడప్పుడూ అసహ్యంగానూ, చాలా కాలం నుంచి ఉంటూ వచ్చింది.

పాతికదాటిన గోపాలం వయసులో—మనసును క్రుంగదీసే చేదు అనుభవాల వికారపు జ్ఞాపకాలేగాని, మధురమైన సన్నివేశాలూ, వాటి తాలూకు మధురానుభూతులూ కలికానిక్కూడా (అంటే శాంపుల్‌కు కూడా అన్నమాట!) లేవు- లేవు.

తల్లీ తండ్రీ తనను పెంచి పెద్ద చెయ్యటం, అందుకూ వాళ్ళు ఎన్నెన్నో అవస్థలు పడటం—అదంతా బాల్య స్మృతిలా అప్పుడప్పుడూ మాత్రమే గుర్తొచ్చే చేజారిన తియ్యటి కల.

మేనమామ ఇంట చాకిరీచేసే జీతంలేని పనివాడుగా తను బతుకుతూ, పడుతూ-లేస్తూ, బియ్యేదాకా స్కాలర్‌షిప్పులు మీద ఈడ్చుకొచ్చిన గతకాలమంతా—ఒక చింతల చికాకుల పీడకల.

వాళ్ళతో తనకిక పడదనీ, తనింక ఎల్లకాలమూ వాళ్ళ చెప్పుచేతుల్లో ఉండబోవటం లేదనీ, వాళ్ళకూ తనకూ కూడా నిర్ధారణగా తేలిపోయాక—

జానెడు పొట్టను చేత్తో పుచ్చుకొని బస్తీ బజార్లంట పడ్డాడు. దిగులు ముంచెత్తి ఇక గుండె జారిపోయేవేళకి, ఆశాదీపంలా చిన్న ఆసరా దొరికింది.

ఆ రకంగా గోపాలం ఒకానొక ప్రింటిగ్ ప్రెస్‌లో ప్రూఫ్‌రీడర్ అయ్యాడు.

వారం పదిరోజులు మాత్రం ఆర్ట్సుకాలేజీలో తనకు ముఖపరిచయమున్న ఒక స్టూడెంటు గదిలో ఏలాగో గడిపేశాడు.

ఆ అబ్బాయి దగ్గర ఆ మొగమాటానికీ కాలదోషం పట్టిందని తెలిసేసరికి, తప్పని సరయి 'గృహవసతి' కోసం మళ్ళీ సందులూ

గొందులూ వెదకనారంభించాడు.

ప్రెస్‌లో గోపాలం పేరుకు ప్రూఫ్ రీడర్ అయినా, నానా చాకిరీ చెయ్యాల్సి వుంటుంది. ప్రూఫ్‌లు పుచ్చుకుని పెద్ద పెద్ద పార్టీల దగ్గరకి స్వయంగా వెళ్ళాల్సి ఉంటుంది. వాళ్ళు ప్రూఫ్‌లు దిద్ది ఇచ్చేదాకా పడిగాపులు కాయాల్సి ఉంటుంది.

విసుగ్గా ఉంటుంది గోపాలానికి. ఐనా భరించక తప్పదు. నెల జీతం రెండువందలుగా ఖరారైంది. ఈ ఆధరువును నిలుపుకోవాలి. అజాగ్రత్త చేస్తే ఉద్వాసన తప్పదు. ఆ పైన వగచి లాభం వుండదు.

ప్రెస్ పనివేళల్లో కాకుండా కేవలం సాయంత్రాలూ, రాత్రిళ్ళూ మాత్రమే సందులూ గొందులూ తిరిగాడు గోపాలం (పాపం శమించుగాక, గోపాలం పరమ బుద్ధిమంతుడు) ఇంటికోసం- అదే గదికోసం.

'వెదికేది దొరకదు' అనేది నిరాశావాదుల జీవన సూత్రం కావచ్చు.

'వెదికేది వెదికిన చోట దొరకదు' అనే సూత్రాన్ని నమ్మవచ్చు- అనుకొన్నాడు గోపాలం.

ఎందుచేతంటే, వారం పది రోజులుగా సందుల్లో వెదికితే దొరకని గృహవసతి అతనికి 'చక్కని రాజమార్గం' లోనే దొరికింది.

బస్తీలో ఒక పాత కోవెల ఉన్న ప్రాంతం అది. కోవెలకు వెళ్ళేందుకు ఒక వంద గజాల ఇవతలే, ఒక పుష్కరిణికి నైరుతి దిక్కుగా ఒక పెద్ద పాత మేడ వుంది.

ఏ అరవై డెబ్భై ఏళ్ళో ఉంటుంది ఆ కట్టడం వయసు. వీధిలోంచి చూడటానికి చాలా ఎత్తుగా, చాలా విపులంగా కన్పిస్తుంది.

ఆ కట్టడంనిండా గదులూ, వాటాలూ వున్నాయి. మధ్యలో ఖాళీ జాగా ఉంది. ఆ ఖాళీ జాగాలో నుయ్యి ఉంది.

వీధివేపు వుండే గదుల వరస పైన మాత్రం మళ్ళీ గదులూ, వాటాలూ ఉన్నాయి. అక్కడికి వెళ్ళటానికి ఖాళీ జాగాలోంచే కర్ర మెట్లు ఉన్నాయి.

ఏళ్ళ తరబడి వెల్లవేసిన జాడ లేదు. పెచ్చులూడి ఇటుకలు బయట పడి అవీ జీర్ణమయిపోతున్న చిహ్నాలు కనబడుతున్నాయి.

నూతిచుట్టూ పేరుకున్న పచ్చటి పాచి, గోడలమీద మసి మరకలు, ఆ వాతావరణమంతటా ఎల్లవేళలా వినిపిస్తూండే నానారకాల ధ్వనులూ, కిటికీలనుండి దట్టంగా వెలువడే

వంటపొగలూ, పిల్లల ఏడుపులూ, గోడలవెంటా- ఖాళీ జాగాలో అడ్డ దిడ్డంగా ఆరేసిన బట్టలు....

ఒక రకంగా అది 'మరో ప్రపంచం'

ఆ మేడలో పది పన్నెండు కుటుంబాలు కాపురం వుంటు న్నాయి. మేడ గురించి కోర్టులో వ్యాజ్యం ఏదో నడుస్తోందని కొంద రంటారు. మేడకు మూడిళ్ళ అవత లున్న కిరాణా కొట్టు షావుకారు అద్దెలు వసూలు చేస్తుంటాడు. అయనే స్వంతదారులా వ్యవహ రిస్తూంటాడు.

"అదృష్టవంతుడివయ్యానువ్వు! చక్కగా మెట్లక్రింద గది ఖాళీ ఐంది. చేరిపో! నెలకు ఇరవై. అడ్వాన్సు యాభై. ఇరవైలో కరెంటు కూడా చేరిందన్నమాట! ఏం దర్జా చూసుకో! అయితే ఎక్స్ ట్రాగా నువ్వేమీ ఫానూ గట్రా వేసుకోకూడదు. నీ రూమ్‌లో నువ్వొకడివి తప్ప ఇంకెవరూ గెస్టులు ఉండకూడదు. ఇంకే షర తులూ లేవు. ప్రొద్దున్న నాలుగు న్నరనుంచి ఆరుదాకా నూతి దగ్గ రకు వెళ్ళకూడదు. అది ఆడవాళ్ళ టైము. అదీ విషయం."

షావుకారు చెప్పిందంతా సావ ధానంగా విని, ఆ షరతులన్నీ మనసుకు పట్టించుకుని, యాభై అడ్వాన్సివ్వలేను, నలభై మాత్రం ఇస్తానని, అందుకు ఆయన్ను విశ్వప్రయత్నం మీద ఒప్పించి, నలభయ్యీ ఆయనకు సమర్పించి, ఆయన ఆశీర్వాదాలు స్వీకరించి, ఆ సాయంత్రం ప్రెస్‌లో డ్యూటీ ముగిశాక సరాసరి హాస్టలుకెళ్ళి, అంతవరకూ ఆశ్రయమిచ్చిన మిత్రుడికి రకరకాల కృతజ్ఞతలు చెప్పి, తన ట్రంక్ పెట్టెతో, పాత మేడలో తన నివాసమైన 'మెట్లకింద గది'ని చేరుకున్నాడు గోపాలం.

గదిని కాస్త పరిశీలనగా చూసుకునేసరికి షావుకారు గారి కల్పనా చాతుర్యానికి పరమాశ్చర్య మనిపించింది.

గదిలో ఉన్న ఏకైక కరెంటు పాయింటూ, ప్రక్క వాటానుంచి ప్లాస్టిక్ వైర్ తీసుకున్నది.

పెట్టె విప్పి- బట్టలూ, పుస్త కాలూ, మిగతా సామాన్లూ గదిలో సర్దేసరికి గది పూర్తిగా నిండి పోయినట్టనిపించింది.

చేతనయి, శక్తివుండి ఏదయినా 'గోస్టు'ను గదిలో తన కూడా ఉంచుకోవాల్సిందే తప్ప, 'గెస్టు' నెవరయినా ఆహ్వానించి గదికి తీసుకురావటం దారుణమైన సాహస

మనిపించింది. అది అసాధ్యమని కూడా తేటతెల్లమైపోతోంది.

గదిలోకి గుమ్మం మినహా గాలి రావటానికి మరో మార్గం లేదు. బట్టలు తలగడగా ఉంచుకుని వెల్లకిలా పడుకుని, గాలికోసం తలుపు బార్లా తెరిచిపెట్టి చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు గోపాలం.

అతని ఆలోచనలయినా యథేచ్ఛగా సాగటానికి వీలులేకుండా మరి కాస్సేపటిలోనే దోమల దాడి ప్రారంభమయింది.

నాలుగు వాటాల అవతలనుంచి పిల్లవాడి ఏడుపు, మరో వాటాలోంచి గబుకూ దబుకూ మంటూ పిండి రుబ్బుతున్న చప్పుడు, ఎదుటి వరస వాటాల్లో ఒక దాంట్లోంచి ఖంగూ ఖంగూమని ఒక ముసలాయన దగ్గు.

బావి దగ్గర పేరుకున్న పాచి నుంచి భరించరాని వాసన— దుర్గంధం!

గదిలో లైటార్పేసినా, మసక మసక వెలుతురుగా ఉంది.

గదిలో పూర్వం నివసించి వెళ్ళిన పుణ్యాత్ములెవరో, ఎంతగా తంటాలు పడ్డారో....

గదికే స్వతస్సిద్ధంగా ఒక వాసన ఉన్నట్టుంది. శూన్యంగా, ఉక్కగా, మరిగిపోయినట్టు, ఊపిరాడనట్టు ఉంది గోపాలానికి. చెవిలో దోమల హోరు-చెడ్డ చిరాకు తెప్పిస్తోంది.

ప్రెస్సూ, ప్రెస్సు వాతావరణం, ప్రెస్సులో యంత్రాలగోల-వీటితో పగలంతా సతమతమయిన గోపాలానికి—ఈ పాతగదిలో కొత్త అనుభవం రోత తెప్పిస్తోంది.

లేచి కూచున్నాడు. ఇస్సు అన్నాడు. అట్టముక్క తీసుకుని కాస్త గాలి విసురుకున్నాడు. లేచి నిలబడ్డాడు. వొళ్ళు విరుచుకున్నాడు. చేతులు—పైన ప్రావులకి తగిలాయి.

గదిలో ఎక్సర్సైజ్ చెయ్యటానికి అసలు లేదు.

గదిలోంచి బైటకొచ్చాడు. ఖాళీ జాగా లోనే, ఆ బండలమీదే పడకలు వేసేశారు చాలా మంది. దుర్గంధమూ, వాతావరణ కాలుష్యమూ వాళ్ళనేమీ బాధించినట్టు లేవు.

పాచిపేరుకున్న బండలమీద జారిపడకుండా అడుగులో అడుగు వేసుకుంటూ నూతిని దాటి వీధి గుమ్మం దగ్గరకొచ్చాడు గోపాలం. గుమ్మానికి అటూ ఇటూ ఉన్న బండలమీద కొన్ని మానవాకారాలు శయనించి ఉన్నాయి.

వాళ్ళు లోపలి వాటాల తాలూకు

శాస్త్రీలే అయి ఉండాలి. ఎవరో మరెక్కడా నీడ దొరకని బిచ్చగాళ్ళు అయి ఉన్నా ఆశ్చర్యం లేదు.

వాళ్ళు పడుకున్న ఆ బండల వేపు దిగులుగా చూశాడు గోపాలం. అతనికి నిద్ర కమ్ముకు వస్తోంది. ఆ బండల్లో ఒకటి ఖాళీగా ఉన్నా హాయిగా మేను వాల్చి కునికేసేవాడు.

'అద్దెకు గది తీసుకుని కూడా హాయిగా పడుకునేందుకు గతిలేక పోయింది కదా!' అని స్వగతంలో నిట్టూరుస్తూ మళ్ళీ తన గదికే వచ్చేశాడు.

అంతకు ముందు గమనించ లేదుగాని, దాదాపు అన్ని వాటాల వాళ్ళూ తలుపులు బార్లా తెరిచేసే పడుకుని ఉన్నారు. కొన్ని గుమ్మాలకు గోనె పట్టాలు కర్టెన్లకి మల్లే వ్రేలాడుతున్నాయి.

గదిలోకి చేరుకుని వెల్లకిలా పడుకున్న గోపాలానికి, తను ఒక గుహలోకి చేరుకున్నట్టని పించింది.

ఏది ఏమైనాసరే, నిద్రపోయి తీరాలి—అని బలవంతాన కళ్ళు మూసుకు పడుకున్నాడు.

గోపాలం పట్టుదలగల మనిషే!

నిమిషానికొకరకంగా మెదులుతున్న ఆలోచనల్నిగాని, శరీరాన్ని సూదుల్లా పొడిచేస్తున్న గాలిలేనితనాన్ని గాని, గుంయ్యిమని గోల పెట్టేస్తున్న దోమల సంగీతాన్ని గానీ, దేన్నీ లెక్క చెయ్యకుండా అఖరికి ఎలాగైతేనేం—నల్లటి చల్లటి నిద్రాదేవి ఒడిలో తల వాల్చగలిగాడు.

అంతలో ఏదో గురగురమని చప్పుడైంది. కాళ్ళను ఎవరో తాకినట్టయింది.

ఉలిక్కిపడి లేచాడు గోపాలం. కాళ్ళదగ్గర నల్లగా నీడల్లో నీడలా కదులుతుందొక చిన్న ఆకారం. పరీక్షగా చూడగా అది ఒక నాలుగు కాళ్ళ జంతువు. కుక్క! కుక్క పిల్ల! పిల్ల కుక్క!!

కళ్ళు చిట్లిస్తూ చూసి చూసి, అది మరొకటీ మరొకటీ కాదు—కుక్కపిల్లే! పిల్లకుక్కే! అని తేల్చుకున్న తర్వాత—అపురూపంగా కమ్ముబోతున్న నిద్రను పాడుచేసినందుకూ, అసలు పర్మిషన్ లేకుండా తన గదిలోకి వచ్చినందుకూ, వచ్చింది ఊరుకోక తన కాలిని తాకుతూ నాకినందుకూ (లేక, నాకుతూ తాకినందుకూ) విపరీతమైన కోపమూ—చిరాకూ ఉవ్వెత్తుగా ముంచుకు రాగా, "ఛాయ్!" అన్నాడు గోపాలం,

జీవశక్తినంతటినీ గొంతుకలో ప్రతిధ్వనింపజేస్తూ.

"గుర్_గుర్" మని శబ్దం చేసింది కుర్రకుక్క. అది అతిగారాబంగా తోక ఆడించినట్టు ఆ మసక వెలుతురులో స్పష్టంగా తెలిసిపోయింది గోపాలానికి.

"ఛ-పో!" అంటూ కసిరాడు గోపాలం. దిగ్గుమని లేచి కూచుని, చెయ్యి చాపి తడుముకుని, లైటు స్విచ్చి నొక్కాడు.

వెలుతురులో చూడగా ఆ కుక్క మరీ వికారంగా ఉంది. నల్లగా ఉంది. ఒంటి మీద బొచ్చు చాలా తక్కువగానూ, మచ్చలు చాలా ఎక్కువగానూ ఉన్నాయి.

"ఛ-ఛ!" అంటూ విసుక్కుని, "ఊఁ_పో" అంటూ చేత్తో విసురుతూ కుక్కపిల్లను తలుపు అంచుతోనే బయటికి నెట్టి, అలాగే తలుపు మూసేశాడు. 'అమ్మయ్య' అనుకున్నాడు.

కాస్సేపయ్యాక తలుపు తెరిచాడు. కుక్కపిల్ల కనిపించలేదు. 'అమ్మయ్య-అమ్మయ్య' అనుకుంటూ తలుపు మళ్ళీ బార్లా తెరిచేసి, లైటు ఆర్పేసి, పడుకున్నాడు.

మరో గంట గడిచాకగాని గోపాలానికి మళ్ళీ నిద్రపట్టలేదు.

ఈసారి పట్టిన నిద్రలో ఒక కల వచ్చింది. తను అచ్చుయంత్రం ముందున్నాడు. అచ్చు వేస్తున్న కాగితాలన్నీ గాలికెగిరిపోతున్నాయి. తను వాటిని సర్దలేక సతమతమవుతున్నాడు. ఎక్కణ్ణుంచో కుక్కపిల్ల వచ్చి తనని పీకుతోంది. కుంయ్యి కుంయ్యి మంటోంది. గురగుర మంటోంది.

ఉలిక్కిపడి లేచాడు గోపాలం.

నిజంగానే కుక్కపిల్ల తన పక్కనే పడుకుని ఉంది. గురగుర మంటోంది. ఒక్క ఉదుటున లేచి కూచున్నాడు. "ఛాయ్-పో-ఛా" అంటూ కేకలు పెట్టాడు.

పిల్లకుక్క వెనక్కి తగ్గింది. అదనుచూసి తలుపువేసేసి, జుత్తు పీక్కున్నాడు గోపాలం. "ఛ-ఛ" అనుకున్నాడు.

'ఎన్ని వాటాలున్నాయి! తలుపు లెంత బార్లా తెరిచున్నాయి! గోనెపట్టాలు వ్రేళ్ళాడుతూంటే ఉన్నాయిగాక. ఈ కుక్క ఏ వాటాలోకైనా సులభంగానే వెళ్ళిపోవచ్చునే!

తన గదిలోకే ఎందుకురానాలి? వచ్చింది ఊరుకోక, తన పక్కని ఎందుకు పడుకోవాలి?

ఛ! అసలీ గదిలో దిగటం బుద్ధి తక్కువయింది. తప్పదు - రేపే గది మార్చెయ్యాలి!'

'గది మార్చెయ్యాలి' అను కుంటూ పడుకున్నాడు గోపాలం ఆ ఆలోచన మెదలటంతో మళ్ళీ నిద్రపట్టలేదు.

'దిగీ దిగగానే గది ఖాళీ చెయ్య టమంటే-ఎంత చిక్కు! షావు కారు అడ్వాన్సు డబ్బు వెనక్కి ఇస్తాడా? ఇవ్వనంటే అతనితో ఏమని పేచీపడటం? ఇంతకీ-గది ఖాళీచేసి. తను వెంటనే ఎక్కడి కని వెళ్ళేట్టు?

మళ్ళీ హాస్టలుకు వెళ్ళటానికి మనస్కరించలేదు. పోనీ- మేనే జర్‌ని బ్రతిమిలాడి, ప్రెస్సులోనే ఏమూలనో తలదాచుకుంటే? పోనీ, రాత్రుళ్ళు అయినా-అక్కడే పడు కునేస్తే?

బాగుంది — పగళ్ళంతా తను ఎటూ ప్రెస్సులోనే గడుపుతున్నాడు. రాత్రిళ్ళు కూడా అక్కడే గడిపే పనయితే, తనకిక వేరే గది ఎందు కూ? అక్కడ-ఆ యంత్రాల గోల మధ్య-తనకు నిద్ర పడుతుందా ఏమన్నా నా?'

ఎక్కడో కోడి కూస్తోంది. మూడు వీధుల అవతలున్న మెయిన్‌రోడ్ మీద వాహనాలు వెళ్ళటం మొదలైంది. బావిదగ్గర ఎవరో నీళ్ళు చేదుతున్నారు. గిలక శబ్దం కిరకిరమని విన్పిస్తోంది.

తలపుల గతుకుల్లో పడీ లేచీ మెదడు అలిసిపోవటాన, అలాగే పడి నిద్రపోయాడు గోపాలం. 'మళ్ళీ ఉదయాన్నే లేవాలి. తొంద రగా తయారయి ప్రెస్‌కెళ్ళాలి' అనుకున్నాడు ఆఖరిసారిగా నిద్ర కమ్ముకుంటూండగా.

* * *

మరునటిరోజు యధావిధిగా ప్రెస్‌లో డ్యూటీకి వెళ్ళిన గోపాలం డ్యూటీ ముగిశాక ఆ సాయంత్రం సాధ్యమైనన్ని వీధులు తిరిగాడు- మరో అనువైన గదికోసం.

అతని ప్రయత్నాలు ఏ మాత్రం ఫలించలేదు.

కడుపున ఆకలి కరకరమన్న ప్పుడు 'మెస్' కి వెళ్ళి ఆ చప్పిడి మెతుకులే పరమాన్న ప్రాయంగా తిన్నాడుగాని, మళ్ళీ పాత మేడలో తన 'గది' కి వెళ్ళాలని గుర్తొచ్చే సరికి కడుపులో చెయ్యేసి దేవినట్ల యింది.

భోంచేసిన వెంటనే కూడా బజార్లంట లక్ష్యం లేకుండా తిరిగి, కాళ్ళుపీకి, అలసట కమ్మేశాక ఇక అప్పుడు వెనుదిరిగాడు.

'ఇప్పుడు నరకంలోనైనా నాకు నిద్రపడుతుందిలే' అనుకుంటూ.

బాగా రాత్రయింది. పదకొండు

న్నర కావస్తోంది. అపుడు ఆ పాత మేడలో ప్రవేశించిన గోపాలానికి ఏదో అస్తవ్యస్తపు చీకటి లోకంలో అడుగు పెట్టినట్లని పించింది.

ఆ క్షణాన గోపాలాన్ని ఎవరయినా చూడటమే గనుక జరిగి ఉంటే, అతన్నొక తాగుబోతు క్రింద జమకట్టేవారు.

అంతగా స్థిమితం తప్పిన శరీరాన్ని ఎలాగో గదిదాకా ఈడ్చి చేరవేసి, తడుముకుంటూ తాళం తెరవబోయాడు.

కాలికేదో కాస్త మెత్తగా, కాస్త గట్టిగా తగిలింది. మరుసటి నిమిషం ఆ మెత్తటి పదార్థం 'గురగుర' మనే జీవశబ్దాన్ని వెలువరించింది.

తోక ఆడిస్తూ గోపాలంకేసి లేచింది ఆ నల్లటి ఆకారం- కుక్కపిల్ల.

మానవమాత్రుడి కెంత కోపం రావచ్చో అంత కోపమూ వచ్చింది గోపాలాని కప్పుడు.

యుక్తాయుక్త విచక్షణను కోల్పోయాడు. పూర్తిగా ఉన్మత్తుడై పోయాడు. ఏం చేశాడు?

తన యావచ్ఛక్తినీ కుడికాలిలోకి కేంద్రీకరించి, చేతనైనంత సూటిగానూ, బలంగానూ ఆ కుక్కపిల్లమీదకి ప్రయోగించాడు.

"కుయ్యో! కుయ్యో!" మని దూరంగా పరిగెత్తింది పిల్లకుక్క.

కుక్కపిల్ల కేం తెల్సు గోపాలం కోపం దెబ్బ?

"ఆఖరికి ఊరకుక్కలకు కూడా లోకువైపోయానా నేను? ఆ(" అని రోషంగా అనుకుంటూ గదిలోకి ప్రవేశించి పడకేసేశాడు.

'దెబ్బకి రోగం కుదిరింది. మళ్ళీ ఈ ఛాయలకి రాదు' అని కుక్కపిల్లకు తను బాగా బుద్ధి చెప్పినందుకు కాస్త తృప్తిపడి, తెరిచి ఉన్న తలుపుగుండా కాస్త కాస్త రేషన్‌గా వస్తున్న గాలి నుంచి ప్రాణవాయువును అనుభవిస్తూ, కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

టన్నుల బరువు చీకటితో అతని కనురెప్పల్ని కప్పేస్తూ, నిద్ర అతణ్ణి కమ్మేసింది.

కమ్ముకున్న నిద్రలో ఈసారి గోపాలానికి కలలేవీ రాలేదు. సుఖనిద్రనే అనుభవించాడు. కాని అర్థరాత్రి దాటిన కాస్సేపటికి హఠాత్తుగా మెలకువ వచ్చేసింది.

గోపాలం పక్కలో పడుకుని సుఖనిద్రను అనుభవిస్తోంది కుక్కపిల్ల. దానికి నిద్రలో ఏవో కల

లొచ్చాయి కాబోలు, మూతితో గోపాలాన్ని పొడుస్తూ గురగుర మని గునుస్తోంది.

"ఛాత్!" మని లేచి కూచున్నాడు గోపాలం. ఈసారి ఉగ్ర నరసింహుడై పోయాడు.

కమ్మగా పట్టిన నిద్ర చెడిపోయిన చిరాకూ, తన కాలి తాపును కూడా లెక్కచెయ్యని ఆ అల్ప ప్రాణియొక్క తెంపరి తనమూ-అతనికి పిచ్చి కోపాన్ని తెప్పించాయి.

కుక్కపిల్లమీద ప్రయోగించటానికి సరైన ఆయుధం కోసం అటూ ఇటూ తడుముకున్నాడు గాని, గదిలో అటువంటిదేమీ లభించలేదు.

ఆయుధం దొరకని అసహాయత్వం కోపాన్ని ద్విగుణీకృతమూ త్రిగుణీకృతమూ చేస్తుండగా, ఇదివరకు ప్రయోగించిన తన కాలును గుర్తు తెచ్చుకుని, యావత్ శరీర శక్తినీ అందులోకి కేంద్రీకరించబోయాడు.

కుక్కపిల్లలకు మానవ మనస్తత్వాన్ని సరిగ్గా గ్రహించేశక్తి ఎలా వస్తుందో ఏమో!

గోపాలం కాలు కాస్త అలా కదిలిందో లేదో కుక్కపిల్ల వెనక్కి తగ్గింది. గదిలోంచి బైటకి వెళ్ళింది.

కాని అంతటితో తృప్తిపడి ఊరుకోలేదు గోపాలం. కుక్కపిల్లను రోడ్డుమీదికి వదిలితేగాని తనివి తీరదనుకుని, దాన్ని వెంటాడనారంభించాడు.

నూతి చుట్టూ తిరిగింది కుక్కపిల్ల. గోపాలం కూడా తిరిగాడు. "ధూత్! ఛాయ్! హెయ్! హూయ్!" అని నానారకాలుగా అదిలించాడు.

ఆవరణ అంతా అటూ ఇటూ తిరిగింది కుక్కపిల్ల - గోపాలాన్ని తన వెంట తిప్పుకుంది.

"పో-బైటకిపో!" అని గదిమాడు గోపాలం. పిల్ల కుక్కకు మానవభాష అర్థమవుతుందని ఎలా అనుకున్నాడో ఏమిటో?

"కుంయ్యి....కుంయ్యి" అంది కుక్కపిల్ల గునుస్తూ. కుక్కభాషలో "ఆఁ.... నేను పోను" అని అర్థం కాబోలు.

"పో, చంపేస్తాను" అంటూ మళ్ళీ తరిమాడు గోపాలం.

ఈసారి కుక్కపిల్ల కర్ర మెట్లు ఎక్కేసింది. పైకి వెళ్ళిపోయింది.

కుక్కను వెంబడిస్తూ తనూ కర్రమెట్లెక్కాడు గోపాలం. పాత కాలపు మెట్లు. మనిషి బరువు కదిలితే అవి ఊగిపోతున్నాయి.

డాబా మీదికెళ్ళిన గోపాలం కాస్త తెరిపిపడ్డాడు. కారణం- అక్కడ కాస్త గాలి ఆడుతోంది.

మెట్లు ఎక్కగానే ఎడంవేపు తిరిగితే సన్నటి వరండా ఉంది. ఆ వరండా వెంట గదులూ, వాటాలూ ఉన్నాయి.

కుక్కపిల్ల కోసం వరండాకేసి చూశాడు గోపాలం. అది లేదక్కడ.

ఇవతల ఖాళీగా ఉన్న డాబాలో ఏమిటేమిటో పనికిరాని వస్తువులు గజిబిజిగా ఉన్నట్టు అస్పష్టంగా తెలుస్తోంది. పాత డబ్బాలూ, బట్టల పేలికలూ, చినిగిపోయిన పనికిరాని బట్టలూ - ఏమిటేమిటో ఉన్నాయి. ఆ మేడలో అన్ని వాటాలు వాళ్ళూ ఆ డాబాను చెత్త పోగేసే స్థలంగా వాడుకున్నట్టుంది.

ఆ గజిబిజి అవతలినుంచి గుర గురమని శబ్దం వినిపించింది.

అప్పటికే ఉద్రిక్తుడైపోయిన గోపాలం, అటువేపు నడిచాడు.

ఆ కుక్కపిల్లకు అదేం సరదానో మరి, పాత తారు డబ్బా చుట్టూ రౌండ్లు వేస్తూ గోపాలాన్ని తిప్పించింది.

తారు డబ్బాలోంచి తొంగి చూస్తున్న ఒక కర్ర ముక్కను చప్పున అందుకున్నారు గోపాలం. "ఇప్పుడు చెప్తా నీపని-ఫో! అవతలికి ఫో! కిందికిఫో!" అంటూ పిల్లకుక్కను తరిమాడు. అదను చూసి కర్రతో ఒక్కటి అంటించాడు.

"కుంయ్యో-కుంయ్యో!" మని అరిచింది కుక్కపిల్ల. ఈసారి దెబ్బ కాస్త తీవ్రంగానే తగిలినట్టుంది.

"ఫో!" అంటూ విజయ గర్వంతో అరిచాడు గోపాలం.

మెట్లవేపు కాకుండా - అటు వేపున్న వరండాకేసి నడిచింది కుక్కపిల్ల. అంతలో—

"ఏ(వి(ట్రా రాజా!" అని ఆ మసక చీకటిలోంచి ఒక సన్నటి స్త్రీ స్వరం వినిపించింది.

ఆగిపోయాడు గోపాలం. కళ్ళు చిట్లిస్తూ వరండాకేసి చూశాడు.

"ఏవి(ట్రా రాజూ!" అంటూ పైటా, పావడా ధరించిన ఆ పరువంలో ఉన్న అమ్మాయి— కుక్కపిల్లను దగ్గరికి తీసుకుంది.

తీసుకుంటూ, గోపాలం వేపు చూపింది.

పరుగువల్లా, కుక్కను తరమటంవల్లా అలిసి ఎగరొప్పుతూ, పీక్కున్నట్టూ రేగిపోయిన జుత్తుతో ముఖంలో ఇంకా సర్దుకోని పిచ్చి కోపంతో, చేతిలో మహాస్త్రంలా ధరించిన కర్రముక్కతో....

చూపిన వారెవరైనా పెద్దగా

నవ్వేసేట్టున్నాడు గోపాలం.

"మీరూ...." అంది ఆ అమ్మాయి గోపాలాన్ని సందేహంగా చూస్తూ.

"క్రింద వాటాలో-అదే గదిలో నిన్న చేరాను" మహాపరాధం చేసినవాడిలా అన్నాడతను.

"అంటే-మెట్లకింద...."

"ఆఁ.... అదే"

గోపాలం వాలకమూ, ఆ మాట తీరూ ఆ అమ్మాయిలో ఉత్సుకతను రేపుతున్నాయి. "సారీ అండీ....రాజు ఎంత చెప్పినా వినడు. మేమ్ముంటున్నది ఈ పైనే ఆ చివరి వాటాలో. నేను రాజును జాగ్రత్తగా పడుకోబెడతాను. కట్టి వేస్తే ఊరుకోడు. క్రింద మిగతా వాటాల్లోకి వెళ్ళడు. అదేమిటో మెట్లక్రింద గది అంటేనే వీడికి... సారీ అండీ!"

మెల్ల మెల్లగా తలకెక్కింది గోపాలానికి. "ఐతే ఇది పెంపుడు కుక్కా?"

"నేనే పెంచుతున్నా" అందా అమ్మాయి కుక్కను మరింత హత్తుకుంటూ.

"సారీ అండీ! నాకు తెలీదు" గోపాలం చప్పున అన్నాడు. చేతిలో కర్రను క్రిందికి జార్చేశాడు. "నిజంగా నాకు తెలీదు. అది- నా గదిలోకొచ్చి- మరే తలుపు వేసేస్తే గాలి రాదు. తలుపు తెరిస్తేనేమో ఇదొచ్చేస్తూంది. వచ్చీ..."

"రాజు సంగతి నాకు తెలుసులెండి. మనిషితోడు కావాలి."

"మీ కుక్క అని తెలీదు నాకు. వెరిసారీ!" కింద పడేసిన కర్రకేసి వోరగా కూడా చూసే ధైర్యం లేకపోయింది గోపాలానికి.

సన్నగా నవ్వుతూ వోరగా అతనివేపు చూసింది ఆ అమ్మాయి.

"నా పేరు గోపాలం" అన్నాడు గోపాలం. ఎందుకు చెబుతున్నాడో తెలియకుండానే.

"నా పేరు వసంత! బియస్సీ చదువుతున్నాను" అంది ఆ అమ్మాయి, సన్నటి నవ్వును తల వంచుకుని కొనసాగిస్తూ.

"కింద భలే ఉక్కపోసేస్తోంది" అన్నాడు గోపాలం.

"మరే-ఇక్కడ కాస్త నయం" అంది వసంత. "చూశారా! రాజుకి మనిషి తోడు కావాలి. ఎలా పడుకున్నాడో చూడండి! మిమ్మల్ని డిస్టర్బ్ చేశాడు కదూ! ఏమీ అనుకోకండేం?...."

"భలేవాళ్ళే!"

* * *

ఆపైన ఎలాగైనా సాగవచ్చు, ఎలాగైనా ముగియవచ్చు. అక్కడాక ప్రేమకథ మొదలయింది. ●